# నవతరం


RNI NO. APTEL/2014/58326

తెలుగు దినపత్రిక

సంపుటి : -13 సంచిక : 105 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

20-02-2026 శుక్రవారం వెల : 1 /- పేజీలు : 4

# పాలథీన్ కవర్లతో పెను ప్రమాదం

- పర్యావరణానికి తీవ్ర ముప్పు
- పశుపక్ష్యాదులకు ప్రాణహాని
- ప్లాస్టిక్ వల్ల పెరుగుతున్న వ్యాధులు
- నిషేధాలు ఉన్నా తగ్గని వినియోగం
- గుడ్డ సంచులే ఉత్తమ ప్రత్యామ్నాయం
- ప్లాస్టిక్ తగ్గించడం ప్రతి ఒక్కరి బాధ్యత

**(నవతరం ప్రతినిధి శ్రీకాకుళం)**

ప్రతి చిన్న అవసరానికి పాలథీన్, ప్లాస్టిక్ వస్తువులను అధికంగా వినియోగించడం వల్ల పర్యావరణానికి తీవ్రమైన నష్టం జరుగుతోంది. ఒకసారి వాడి పారేసే ప్లాస్టిక్ కవర్లు భూమిలో కరిగిపోకుండా సంవత్సరాల తరబడి అలాగే ఉండి నేల సారాన్ని తగ్గించడంతో పాటు చెరువులు, నదులు, సముద్రాలను కలుషితం చేస్తున్నాయి. దీంతో జీవావరణ సమతుల్యత దెబ్బతింటూ ప్రకృతి వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతోంది.

ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వల్ల పశువులు, పక్షులు అనారోగ్యానికి గురవుతూ ప్రాణాలు కోల్పోతున్న ఘటనలు పెరుగుతున్నాయి. మరోవైపు ప్లాస్టిక్ కాల్చినప్పుడు విడుదలయ్యే విషవాయువులు గాలి కాలుష్యాన్ని పెంచి మానవుల్లో కొత్త కొత్త వ్యాధులకు కారణమవుతున్నాయి. క్యాన్సర్, శ్వాసకోశ సంబంధిత సమస్యలు వంటి ఆరోగ్య సమస్యలకు ప్లాస్టిక్ వినియోగం కూడా ఒక కారణమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

పర్యావరణానికి హాని చేసే పాలథీన్ కవర్ల వినియోగాన్ని తగ్గించేందుకు ప్రభుత్వాలు నిషేధాలు విధిస్తున్నా, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ప్రజల్లో మార్పు ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ముఖ్యంగా విద్యావంతులే అధికంగా ప్లాస్టిక్ వినియోగించడం ఆందోళన కలిగించే అంశంగా మారింది. ప్లాస్టిక్ వల్ల కలిగే ప్రమాదాలపై ఎన్నిసార్లు హెచ్చరికలు చేసినా నిర్లక్ష్య ధోరణి కొనసాగుతూనే ఉంది.

ప్లాస్టిక్‌కు బదులుగా గుడ్డ సంచులు, కాగిత సంచులు వంటి పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ఉపయోగించడం అవసరం. బజారుకు వెళ్లేటప్పుడు గుడ్డ సంచి తీసుకెళ్లడం, మాంసం లేదా టిఫిన్ దుకాణాలకు స్టీల్ డబ్బాలు వినియోగించడం వంటి చిన్న చిన్న చర్యలతోనే పెద్ద మార్పు సాధ్యమవుతుంది.

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలి. "ప్రభుత్వం అంటే మనమే" అనే భావన ప్రతి ఒక్కరిలో పెంపొందాలి. ప్రజలు ప్లాస్టిక్ వినియోగాన్ని మానేస్తే దాని ఉత్పత్తి కూడా సహజంగానే తగ్గుతుంది. ప్రకృతికి అనుకూలమైన వస్తువులను ప్రోత్సహించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించవచ్చు.

భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలంటే ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం మనందరి బాధ్యతగా గుర్తించి ఇప్పుడే ఆ దిశగా ముందడుగు వేయాల్సిన అవసరం ఉంది.






# వమరవిల్లి పంచాయతీలో యూరియా పక్కదారి

- రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి
- యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో గార మండలం నాయకులు, రైతుల వినతిపత్రం



**నవతరం - శ్రీకాకుళం**

శ్రీకాకుళం జిల్లా గార మండలం వమరవిల్లి పంచాయతీలో రైతులకు అందాల్సిన యూరియా ఎరువు పక్కదారి పడుతున్నట్లు వచ్చిన ఆరోపణల నేపథ్యంలో రైతులకు న్యాయం చేయాలని కోరుతూ గార మండలం నాయకులు, రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. గురువారం సాయంత్రం 6.30 గంటలకు యువనేత ధర్మాన రామ్ మనోహర్ నాయుడు ఆధ్వర్యంలో ప్రతినిధి బృందం కలెక్టర్‌ను కలిసి సమస్యను వివరించింది.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ యూరియా కొంతమంది మధ్యవర్తుల ద్వారా అక్రమంగా మళ్లింపుకు గురవుతోందని ఆరోపించారు. దీంతో నిజమైన రైతులకు ఎరువుల కొరత ఏర్పడి పంటల సాగు దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగు కాలంలో ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే -మిగతా 2లో

ఎడిటోరియల్

# ఎప్‌స్టీన్ ఫైల్స్

పెట్టుబడిదారీ వ్యవస్థ, దాని ఉన్నతదశ ఎంత వికృత విన్యాసాలతో కూడుకుని ఉంటుందో, ఎంత అమానవీయంగా వ్యవహరించగలదో, నీచ, ద్రోహ, కుటిల, హీన ఆచరణలకు దోహదం చేస్తుందో ఒక రెండు వందలయేండ్ల క్రితమే కారల్‌మార్క్స్ చెప్పాడు. ఆ విషయాలు చాలా స్పష్టంగా తేటగా ప్రపంచం ముందు కనపడుతున్నాయి. వికృత సాంస్కృతిక విలువకు అద్దం పట్టే సంఘటన వింటుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది. జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్ ఉదంతం, దానిలో దాచిపెట్టబడిన వివరాలు, వ్యాపారం, అధికారం కలిసి చేసే నీతిబాహ్య అమానుష కృత్యాలను బయటపెడుతుంది. మనుషులు, మాటలు, నీతులు, రాతలు, బోధలు, రాజ్యాలు, అధికారము, ప్రజాస్వామ్యము, పరిపాలనలు, సంబంధాలు, సంస్కృతులు, అన్నీ వేటి ఆధా రంగా నిర్మితమవుతున్నాయో, వ్యాపార, లాభాలకాడ ఎలా మోకరిల్లుతున్నాయో తెలియపరుస్తుంది. అధికారం వ్యాపారము కలిసి ఆడిస్తున్న నాటకంలో ఎవరెవరు ఏ పాత్రలో జీవిస్తున్నారో విశదపరచింది.

ఈ సంవత్సరం ఆరంభంలోనే బయటకి వచ్చిన ఎప్‌స్టీన్ ఫైల్స్, దేశదేశాల్లోని రాజకుమారులు, దేశాధి నేతలు, వ్యాపారవేత్తలు, ప్రముఖులు ఎందరెందరివో పేర్లను బయటపెట్టింది. అందులో మన అధికారగణ పెద్దలు, వ్యాపారులూ ఉన్నారు. ప్రపంచంలో ఎలాంటి నీచ సంస్కృతి చలామణిలోకి వస్తున్నదో, డబ్బు, అధికారం కలిసి ఎంత వికృతక్రీడ నడుపుతున్నదో తెలుసుకోవచ్చు. జెఫ్రీ ఎప్‌స్టీన్ అనేవాడు అమెరికాలో ఒక ఫైనాన్సియర్‌గా ఎదిగాడు. కరేబియన్ సముద్రంలో అతనికొక పచ్చనిదీవి ఉంది. అది ఏ చట్టమూ, అధికారము లేని అతని స్వేచ్ఛా ప్రపంచం. అక్కడికి ప్రపంచాన్ని శాసించే నాయకులను తీసికెళ్లి, అమ్మాయిలను, చిన్నపిల్లలను వారి లైంగిక అవసరాలకు వినియోగించేవాడు. అమ్మాయిలను చదివిస్తానని, ఉద్యోగాలు ఇప్పిస్తానని దీవిలోకి తీసుకెళ్లి ఈ ఆకృత్యాలకు పాల్పడ్డాడు. సీక్రెట్ కెమెరాలతో వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్ చేసేవాడు. విపరీతంగా డబ్బు సంపాదించాడు.

బిల్‌గేట్స్, బిల్‌క్లింటన్, బార్జ్‌బుష్, బరాక్ ఒబామా, డొనాల్డ్ ట్రంప్, టోనిబ్లెయర్, జోబైడెన్, హిల్లరీ, అబ్దుల్లా, అంబానీ ఇలా చాలామంది ఆయన్ను కలిసినవారిలో ఉన్నారు. ట్రంప్ అయితే అనేకసార్లు కలిసాడు. ఆ దీవిలోనూ వివహరించాడు. అయితే ఆ ఐలాండ్‌లో నరకం అనుభవించామని, చిన్నతనంలోనే లైంగిక హింసకు గురయ్యామని అమ్మాయిలు ఫిర్యాదు చేశారు. మహిళల అక్రమ రవాణా, లైంగిక వేధింపుల కేసులో 2008లోనే ఎప్‌స్టీన్‌కు జైలుశిక్ష పడింది. శిక్ష అనుభవించాడు. లాబీయింగ్ నడిపి బయటకి వచ్చాడు. తరిగి అదే మహిళల అక్రమరవాణా అభియోగాలు, చిన్నపిల్లలపై లైంగికహింస ఆరోపణలతో కోర్టు జైలుశిక్ష వేసింది. 2019లో అతడు జైలులోనే ఆత్మహత్య చేసుకున్నాడని అధికారిక వర్గాలు ప్రకటించాయి. ఆత్మహత్యా, హత్యనా అనే విషయమై సందేహాలున్నాయి. అధినేతల రహస్య జీవితాల వివరాలు అతను ఎక్కడ బయటపెడతాడోనని, హతమార్చి ఉండొచ్చని వినపడుతున్నది. అయితే అతను చనిపోయాక విచారించిన అమెరికా న్యాయ విభాగం, అతని సామ్రాజ్యంలో ప్రపంచ అధినేతల, ప్రముఖుల వీడియోలు, మెయిల్స్ వివరాలు వేలాదిగా ఉన్నాయని తెలిసింది. కొన్ని మెయిల్స్‌ను, వీడియోలను బయటపెట్టింది.

వాటిల్లో ట్రంప్, క్లింటన్, యూరోపియన్ నేతల బండారమంతా బయటపడింది. అంతేకాదు, మన ప్రధాని మోడీ గురించి కూడా ఫైల్స్‌లో ఉందని తేలింది. ఇజ్రాయిల్ ప్రధానితో ట్రంప్ గురించి మోడీ పాటలు పాడి, నృత్యం చేశాడని ఎప్‌స్టీన్ పేర్కొన్నాడు. ఈ మాటలను డీకోడ్ చేసుకోవాల్సి ఉంది. ఇక కేంద్ర పెట్రోలియం మంత్రి హరిదీప్‌సింగ్ పూరి ఎప్‌స్టీన్‌తో జరిపిన సంభాషణలు బయటపడ్డాయి. మంత్రిగారు కలిశానని ఒప్పుకున్నారు. కానీ ఆర్థికాభివృద్ధి గురించి అతనితో చర్చించానని వెల్లడిస్తూ, ఒకరితో వ్యక్తిగతంగా కలవడం తప్పెలా అని, నేరస్తులతో కలిసిన వాళ్లు నేరస్తులయిపోతారా? అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. ఇకపోతే, ఒక అబద్ధాలకోరు, బ్రోకర్ ఫైల్స్‌లో ఉన్నవాటిని ఎట్లా పరిగణనలోకి తీసుకుంటామని కొట్టి పారేస్తున్నారు. కానీ ఇదే తరహా మెయిల్స్ వచ్చిన యురోపియన్ నేతలు కొందరు తమ పదవులకు రాజీనామా చేస్తున్నారు. బ్రిటన్ ప్రధాని అయితే బహిరంగంగానే క్షమాపణలు కోరుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు ఎప్‌స్టీన్ ఫైల్స్ మీద చర్చ జరుగుతోంది. మనదేశ కార్పోరేట్ వ్యాపారి అనిల్ అంబానీకి, అమెరికా నుండి ఫేవర్ జరిగేందుకు ఎప్‌స్టీన్ మధ్యవర్తిత్వం వహించినట్టు ఫైల్స్ చూపిస్తున్నాయి.

ఒక బ్రోకర్, ప్రపంచస్థాయి నేరస్తుడు ఫైల్స్ విషయమై ఒక్కరూ పెదవి విప్పడం లేదు. దేశీయ టి.వి. ఛానెళ్లు కథనాలూ ఇవ్వడం లేదు. మీడియా కూడా ప్రజల కాపలాదారరు పాత్ర నుండి అధికార పీఠాల కాపలాదారుగా మారిపోయింది. ఎప్‌స్టీన్ ఫైల్స్ విషయాన్ని లోక్‌సభలో ప్రస్తావించి ప్రశ్నించినందుకు, ప్రతిపక్ష నాయకున్ని సభకు అనర్హుడు ప్రకటించాలనే ప్రయత్నం మొదలయింది. ఏదిఏమైనా ఒక నేరస్తుడితో దౌత్య వ్యవహారాలు నడపడం, సంబంధాలు కలిగి ఉండటం అనేది చాలా చిన్న విషయంగా పట్టించుకోకపోవడం దారుణం. దీనిపై సమాధానం చెప్పాల్సింది ప్రభుత్వాధినేతలే! పెట్టుబడిదారీ ప్రపంచం ఇలాంటి బ్రోకర్లను పెంచిపోషిస్తదని, హీనసంస్కృతికి కారణమవుతుందని గ్రహించాల్సి ఉంది.

## వమరవిల్లి పంచాయతీలో యూరియా పక్కదారి

మొదటిపేజీ తరువాయి

విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

అలాగే వమరవిల్లి పంచాయతీలో ఎరువుల సరఫరాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, రైతులకు పారదర్శకంగా పంపిణీ చేయాలని, అవసరమైన మేరకు యూరియా నిల్వలను పెంచి అందుబాటులో ఉంచాలని విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను ఓర్పుగా విన్న కలెక్టర్ సంబంధిత అధికారులతో విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గార మండలం ఎంపీపీ గొండు రఘురాం గారు, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు ముంజేటి కృష్ణ, నియోజకవర్గం రైతు విభాగం అధ్యక్షులు పీస శ్రీహరి, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు మార్పు పృథివి, జిల్లా గ్రీవెన్స్ విభాగం అధ్యక్షులు రౌతు శంకర్రావు, మండల రైతు విభాగం అధ్యక్షులు సిమ్మ ధర్మరాజు, జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి వజ్జ వెంకట అప్పలనాయుడు, స్టేట్ సోషల్ మీడియా బైపురెడ్డి నాని, మార్పు రాకేష్, గంట రఘునాథ్ రెడ్డి, సీపాన ఉమామహేశ్వరరావు, తార కృష్ణారెడ్డి, ఎన్ని వాసు, గార మండలం సోషల్ మీడియా సన్యాసి, ఆరంగి శ్రీనివాస్, అప్పు యాదవ్ తదితరులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో రైతులు హాజరై తమ సమస్యలను వెల్లడించారు.

## 28లోగా 'లైఫ్ సర్టిఫికేట్' సమర్పించాలి

**నవతరం -ఆమదాలవలస**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ పొందుతున్న వారు ఈనెల 28వ తేదీలోగా తమ వార్షిక జీవన ప్రమాణ పత్రాన్ని (లైఫ్ సర్టిఫికేట్) తప్పనిసరిగా సమర్పించాలని ఆమదాలవలస ఉప ఖజానా అధికారి (ఎస్.టి.ఓ) బట్న కృష్ణారావు ఒక ప్రకటనలో కోరారు. ఆమదాలవలస పరిధిలో ఇంకా 87 మంది పెన్షనర్లు తమ ధ్రువీకరణ పత్రాలను సమర్పించాల్సి ఉందని, వీరు తమకు సమీపంలోని నెట్ సెంటర్లలో 'జీవన్ ప్రమాణ్' ద్వారా లేదా రాష్ట్రవ్యాప్తంగా ఏ జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీ కార్యాలయంలోనైనా బయోమెట్రిక్ ద్వారా ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చని సూచించారు. వృద్ధాప్యం, అనారోగ్య కారణాల వల్ల బయోమెట్రిక్ పడని వారు లేదా కార్యాలయానికి రాలేని వారు వెంటనే ఆమదాలవలస ఉప ఖజానా కార్యాలయంలో సంప్రదిస్తే, సంబంధిత సిబ్బందిని వారి ఇంటికే పంపించి 'ఫిజికల్ లైఫ్ సర్టిఫికేట్' సేకరిస్తామని ఆయన తెలిపారు.

అయితే, జీవో నంబర్ 315 ప్రకారం పెన్షన్ పొందుతున్న వారు మాత్రం స్వయంగా సంబంధిత ట్రెజరీ కార్యాలయానికి హాజరై, అవసరమైన పత్రాలతో తమ ధ్రువీకరణను పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

## భవన నిర్మాణ కార్మికులకు తీపి కబురు




**నవతరం -శ్రీకాకుళం**

జిల్లాలోని భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమ పథకాలను ప్రభుత్వం పునరుద్ధరించిందని ఉప కార్మిక కమీషనర్ అజయ్ కార్తికేయ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం మేరకు, నిలిచిపోయిన పథకాలను తిరిగి అమలు చేసేందుకు తగిన చర్యలు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. కార్మికులు తమ గుర్తింపు కార్డులు ప్రస్తుతం అమలులో ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని, ఇందుకోసం ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, పాత గుర్తింపు కార్డుతో సమీపంలోని కార్మిక శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

కార్డు గడువు ముగిసినా లేదా నిలిచిపోయినా సంక్షేమ ఫలాలకు అర్హత కోల్పోయే ప్రమాదం ఉందని, కావున కార్మికులు తక్షణమే స్పందించాలని కోరారు. ఇతర వివరాల కోసం 9492555037 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన వివరించారు.

## గ్రామ స్థాయి నుంచే పౌర సాధికారతకు కృషి

డీఎల్ఎస్ఏ కార్యదర్శి కె. హరిబాబు





**నవతరం -ఆమదాలవలస**

గ్రామీణ స్థాయిలో ప్రతి పౌరుడికి తన హక్కులు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించి వారిని సాధికారత దిశగా నడిపించడమే న్యాయ సేవాధికార సంస్థ ప్రధాన ఉద్దేశమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి కె. హరిబాబు తెలిపారు. గాజులకొల్లవలసలో గ్రామ స్థాయిలో పౌరుల సాధికారతపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేసి అర్హత ఉన్న ఏ ఒక్క వ్యక్తికీ సంక్షేమ పథకాలు అందకుండా పోకూడదని, నిరాకరించబడిన సందర్భాల్లో తక్షణమే సంబంధిత శాఖలతో సంప్రదించి వారికి న్యాయం చేయాలని స్పష్టం చేశారు. కులం, ఆదాయం, నివాస ధృవీకరణ పత్రాలతో పాటు రేషన్ కార్డు, ఆధార్, సదరం వంటి కీలక పత్రాలు పొందేందుకు సామాన్యులకు అవసరమైన సహాయం అందించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని హరిబాబు ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ శాఖల ప్రయోజనాలను ప్రజల ముంగిటకే చేర్చడంలో లీగల్ సర్వీసెస్ క్లినిక్‌లు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో సీఎఫ్ఐ-ఎల్డబ్ల్యూఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీరామ్ శ్రీనివాసరావు, జిల్లా రిసోర్స్ పర్సన్ బి. రామ్ ప్రసాద్, క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ శైలజ, న్యాయవాది జి. ఇందిరా ప్రసాద్, ఇతర అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కొత్తూరుకు పల్లెవెలుగు బస్సులు పునరుద్ధరించాలి

- ప్రజా రవాణా లేక గ్రామీణులకు ఇబ్బందులు
- పాత మార్గాల్లో సర్వీసులు తిరిగి ప్రారంభించాలని సిపిఎం డిమాండ్

**నవతరం -కొత్తూరు**

కొత్తూరు పరిసర ప్రాంతాలకు పల్లెవెలుగు బస్సు సర్వీసులను తక్షణమే పునరుద్ధరించాలంటూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈరోజు కొత్తూరు మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజా రవాణా సౌకర్యాల లేమితో కొత్తూరు మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఆర్‌టీసీ అధికారులు కొత్తూరు-గొట్టిపల్లి, పూతికవలస-హడ్డుబంగి, ఆర్‌కే పూరం-అంగూరు, కొత్తూరు-పాతపట్నం, కొత్తూరు-టెక్కలి, కొత్తూరు-హడ్డుబంగి, కొత్తూరు-కడుము, కొత్తూరు-పొంటూరు, కొత్తూరు-దిమిలి మార్గాల్లో బస్సు సర్వీసులను ప్రారంభించి ప్రజలకు ఉపయోగపడేలా చేశారని తెలిపారు. అయితే అనంతరం ఈ మార్గాల్లో సర్వీసులు రద్దు చేయడం వల్ల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఈ పాత బస్సు మార్గాలను మళ్లీ ప్రారంభిస్తే ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని ఆయన అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పల్లెవెలుగు



బస్సులను పునరుద్ధరించడం అత్యవసరమని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం డిమాండ్ చేస్తోందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నప్పటికీ టెక్కలి రెవెన్యూ డివిజన్ కేంద్రానికి సరైన బస్సు సౌకర్యం కల్పించడంలో పాలకులు, జిల్లా అధికారులు నిర్లక్ష్యం చేయడం అన్యాయమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

## గాంధీ మందిరంలో ఘనంగా జయంతి వేడుకలు

## హిందూ ధర్మ పరిరక్షకుడు ఛత్రపతి శివాజీ

**నవతరం -శ్రీకాకుళం**

హైందవ ధర్మ పరిరక్షకుడుగా దేశం కోసం, దైవం కోసం పోరాడిన ఛత్రపతి శివాజీ స్ఫూర్తి ప్రతి భారతీయుడు గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందని వక్తలు పేర్కొన్నారు. నగరంలోని గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధులు సంఘసంస్కర్తల స్మృతి వనంలో చత్రపతి శివాజీ జయంతి వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, డాక్టర్ జామి భీమశంకర్, పైడి హరినాథరావు, ఎన్.నరసింహమూర్తి మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఒక్కరూ ఛత్రపతి శివాజీ స్ఫూర్తితో జీవనం సాగించాలన్నారు. దేశంకోసం ధర్మం కోసం పోరాడిన యోధుడిగా శివాజీ చరిత్రలో నిలిచిపోయారన్నారు. తన జీవనపర్యంతం భారతీయుల కోసం పోరాడిన శివాజీ అమ్మవారి సాక్షాత్కారం పొందిన ధన్య జీవిగా నిలిచిపోయారన్నారు. నాటి పాలకుల దురాగతాలను ఎదిరించి, వెన్ను చూపని వీరుడు చత్రపతి శివాజీ అని కొనియాడారు.

ప్రపంచానికి హిందూ ధర్మం విశిష్టతను చాటి చెప్పిన శివాజీ స్ఫూర్తి సజీవమన్నారు.

తొలుత శివాజీ విగ్రహానికి శివాజీ విగ్రహదాతలు డాక్టర్ చింతాడ కృష్ణమోహన్, పాలవలస రాజశేఖర్ బృందం పూలమాలలు వేశారు. శివాజీ గొప్పతనాన్ని కీర్తిస్తూ అవధాన పండితులు పైడి హరనాధరావు గేయం ఆలపించారు.

ఈ కార్యక్రమంలో గాంధీ మందిర ప్రతినిధులు మెట్ట అనంతంభట్లు, పందిరి అప్పారావు, తర్లాడ అప్పలనాయుడు, జి.నాగేశ్వరరావు, సువ్వారి రాజారావు, శాస్త్రి తదితరులున్నారు

## కామ్రేడ్ జయక్క 6వ వర్ధంతి సభను జయప్రదం చేద్దాం

**నవతరం -పలాస**

శ్రీకాకుళ సాయుధ పోరాట యోధురాలు కామ్రేడ్ పోతనపల్లి జయక్క పోరాట స్ఫూర్తితో బ్రాహ్మణీయ కార్పోరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదామని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ కార్యదర్శి తాంద్ర ప్రకాష్ పిలుపునిచ్చారు. కామ్రేడ్ జయక్క 6వ వర్థంతి రోజైన ఫిబ్రవరి 24న బొడ్డపాడులో నిర్వహించనున్న స్మారక సభను జయప్రదం చేద్దామని ఆయనన్నారు. పలాస మండలం బొడ్డపాడు అమర వీరుల స్మారక భవనం ఆవరణలో గురువారం న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ నిర్వహించిన జయక్క స్మారక సభకు సంబంధించిన కరపత్రావిష్కరణ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహిస్తూ మాట్లాడారు. ఉద్దానం గాలిలో జయక్క ఊపిరి ఇంకా పోరు నినాదమై వినిపిస్తూనే వుందని, మహేంద్రగిరి కొండల్లో ఆమె అడుగుజాడలు పోరుబాటలై కనిపిస్తూనే వున్నాయని, శ్రీకాకుళ పోరాటానికి ఆత్మార్పణకు ముందుకురికిన మొదటితరం మహిళా కామ్రేడ్ జయక్కని వివరించారు. ఆమె జీవితం ఒక విప్లవ కెరటం. .ఆమె అడుగులు ఒక ఉద్యమం.. ప్రజల గుండెల్లో, పోరాటాల వెల్లువలో, వేకువ కిరణాల్లో, ఎర్ర జెండా ఎగురుతున్నంత కాలం కామ్రేడ్ జయక్క సజీవంగా నిలిచే వుంటుందన్నారు. శ్రీకాకుళ సాయుధ పోరాట యోధురాలుగా, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ సీనియర్ నాయకురాలిగా, ప్రగతిశీల మహిళా సంఘం (పీవోడబ్ల్యూ) రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్న సమయంలోనే కామ్రేడ్ జయక్క 2020 ఫిబ్రవరి 24 తేదీన అమరులయ్యారన్నారు. సోంపేట ప్రాంతంలో దళాలనేర్పరిచినపుడు కామ్రేడ్స్ పంచాది నిర్మల, అంకమ్మ, సరస్వతి, పైలా చంద్రమ్మ, జయమ్మ, రమణమ్మ, పారమ్మ, రుక్మిణి, యశోద, ఇందుమతి, రాజేశ్వరి, పూర్ణిమ, మమత, గిరిజ, శారద, కమల తదితరులు చేరి చివరి వరకూ నిలబడ్డారని తెలిపారు. ఆకాశంలోనే కాదు పోరాటంలో కూడా సగమంటూ కామ్రేడ్ సుబ్బారావు పాణిగ్రాహి దళంలో సభ్యులుగా ఉండి పనిచేశారన్నారు. కామ్రేడ్ జయక్క సవర, ఒరియా భాషలను నేర్చుకున్నారని, 52 సంవత్సరాల ఆమె ఉద్యమ జీవితంలో 30 సంవత్సరాలు అజ్ఞాత జీవితం అడవిలోనే గడిపారన్నారు. కామ్రేడ్ జయక్క అమరురాలై అపుడే 6 సంవత్సరాలైందని, ఈ ఆరేళ్ల కాలంలో జాతీయంగా, అంతర్జాతీయంగా అనేక మార్పులు చోటుచేసుకున్నాయని, దేశంలో బ్రాహ్మణీయ కార్పోరేట్ ఫాసిజం పెచ్చరిల్లిందని, విద్వేష రాజకీయాలు, బుల్డోజర్ రాజకీయాలు రాజ్యమేలుతున్నాయన్నారు. మైనారిటీలు బిక్కుబిక్కు మంటూ బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో రాసుకున్న ఆదేశిక సూత్రాలూ, ప్రాథమిక హక్కులూ, ఆదివాసీ ప్రాంతాల్లో అటవీ చట్టాలూ, ప్రజల సంక్షేమం అన్నీ దూదిపింజల్లా తేలిపోతున్నాయని, ఆర్ఎస్ఎస్ బీజేపీ అధికారానికి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని డొల్లచేసి మనుధర్మాన్ని పున: ప్రతిష్టించాలని సర్వప్రయత్నాలు చేస్తోందని, ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్‌కౌంటర్ హత్యలతో ఆదివాసీల మనుగడను ప్రశ్నార్థకం చేస్తుందని విమర్శించారు. అక్కడి ఖనిజ వనరులు, సంపదలను నేటి ప్రభుత్వం బరితెగించి కార్పొరేట్లకు కట్టబెడుతోందని , వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్ని సర్వం కార్పొరేట్లకు నిస్సిగ్గుగా కట్టబెడుతోందని దుయ్యబట్టారు. దేశంలో ఎన్ని నిరసనలు వెల్లువెత్తినా పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాము అనుకున్న పనిని చేసుకుంటూ పోతున్నాయని, ఎన్నో ఏళు ్ళగా ప్రజల రక్తమాంసాలతో, చెమట చుక్కలతో నిర్మించిన ప్రభుత్వ సంస్థలు విద్యుత్, రైల్వేలు, రోడ్లు, టెలికాం తదితర ఆస్తులను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతున్నారన్నారు. ధీర వనిత, వీరనారి కామ్రేడ్ జయక్క ఆరో వర్ధంతి సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ శ్రీకాకుళం జిల్లా కమిటీ నిర్వహిస్తున్న కామ్రేడ్ జయక్క స్మారక సభలో ప్రధాన వక్తలుగా కామ్రేడ్ పోలా ఈశ్వరరావు (రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ , ఏపీ), కామ్రేడ్ ఎం .లక్ష్మి ( అధ్యక్షురాలు, ప్రగతిశీల మహిళా సంఘం) పాల్గొంటారని, కామ్రేడ్ వంకల మాధవరావు (రాష్ట్ర ఉపాధ్యక్షులు, ఏఐకేఎంఎస్, ఏపీ ), కామ్రేడ్ సన్నశెట్టి రాజశేఖర్ (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య, ఏపీ), ఇంకా... పలు విప్లవ, ప్రజా సంఘాల సందేశాలు ంటాయన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలుంటాయన్నారు. ఈ కరపత్రావిష్కరణ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వంకల మాధవరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు గొరకల బాలకృష్ణ, ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు జుత్తు వీరాస్వామి, పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. వినోద్ కుమార్, ఐఎఫ్టీయూ జిల్లా నాయకురాలు సవలాపురపు కృష్ణవేణి, పీవోడబ్ల్యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. ఈశ్వరమ్మ , పోతనపల్లి కుసుమ, అరుణోదయ జిల్లా తదితరులు పాల్గొని మాట్లాడారు.

# బ్రాహ్మణీయ కార్పోరేట్ ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడుదాం




# నాలుగు నవజీవన సూత్రాలు..?

నవ్వుతూ ఉండండి
నవ్వు ఉషోదయరవి కిరణంలా
చిమ్మ చీకట్లను చీల్చివేస్తుంది
అది మనసుమీద జలపాతంలా
ముత్యాలతుంపర్లను చిలకరిస్తుంది

నవ్వితే పోయేదేముంది
చెప్పండి..?
కారు మబ్బుల్లా పేరుకున్న
ఆందోళన కరిగిపోవడం తప్ప...

సంతోషంగా ఉండండి
సంతోషం వసంతమాసపు గాలిలా
హృదయాన్ని హాయిగా
తాకుతుంది
అది లేతచిగురుటాకుల్లా
ఆశలను పచ్చగా
మారుస్తుంది

సంతోషంగా ఉంటే
పోయేదేముంది చెప్పండి..?
ముళ్లకంపల సమస్యలు
పూలవనంలా మారడం
తప్ప...

ఆనందంగా ఉండండి
ఆనందం గంగవాహినిలా
అంతరంగంలో
ప్రవహిస్తుంది
అది చంద్రకాంతిలా
చల్లని శాంతిని చిమ్ముతుంది

ఆనందంగా ఉంటే
పోయేదేముంది చెప్పండి..?
అలజడుల అలలు ఆగిపోవడం
కన్న కలలు నిజం కావడం
తప్ప...

ఆరోగ్యంగా ఉండండి
ఆరోగ్యం పచ్చని వృక్షంలా
నవజీవనానికి నీడనిస్తుంది
అది అమృతధారలా
శరీరానికి శక్తినిస్తుంది

ఆరోగ్యంగా ఉంటే
పోయేదేముంది చెప్పండి..?
దీపశిఖలా దీర్ఘాయువు
వెలుగుతూ ఉండడం తప్ప.



కవి రత్న
సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్




# మెల్లమెల్లగా మకాం మారుస్తున్న హీరోయిన్

ఎంబీబీఎస్ పూర్తిచేసిన శ్రీలీల ఇక పూర్తిస్థాయిలో తెలుగులో నటిస్తుందని, మరిన్ని సినిమాలు చేస్తుందని అనుకున్నారు కొంతమంది. కానీ ఆమె మెల్లమెల్లగా తన బేస్ మార్చుకుంటోంది. టాలీవుడ్ నుంచి కోలీవుడ్ కు, కుదిరితే అట్నుంచి అటు బాలీవుడ్ కు మకాం మార్చే ప్రయత్నాల్లో ఉన్నట్టు కనిపిస్తోంది.

పరాశక్తి సినిమాతో కోలీవుడ్ లో అడుగుపెట్టింది శ్రీలీల. ఆ సినిమా ఆశించిన స్థాయిలో సక్సెస్ అందుకోలేకపోయినప్పటికీ శ్రీలీలకు లుక్స్ కు మాత్రం మంచి గుర్తింపు తెచ్చిపెట్టింది. ఆ వెంటనే అవకాశాలు కూడా క్యూ కట్టాయి.

ధనుష్ కొత్త సినిమాలో శ్రీలీల నటించనుంది. ఈ సినిమాలో సాయిపల్లవితో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోబోతోంది. తాజాగా ఈ సినిమా సెట్స్ పైకి వచ్చింది. ఇప్పుడీ మూవీతో పాటు మరో తమిళ సినిమాకు ఆమె దాదాపు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ధృవ్ విక్రమ్ హీరోగా రాబోతున్న కొత్త సినిమాలో హీరోయిన్ రోల్ చేసేందుకు అంగీకరించింది శ్రీలీల. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన రాబోతోంది. ఇలా ఒకేసారి తమిళ్ లో 2 సినిమాలకు ఆమె కాల్షీట్లు కేటాయించింది. అటు బాలీవుడ్ లో ఇప్పటికే అడుగుపెట్టిన ఈ హీరోయిన్, కుదిరితే మరో హిందీ ప్రాజెక్టుకు కాల్షీట్లు కేటాయించాలనుకుంటోంది. అదే కనుక జరిగితే తెలుగులో ఆమెకు గ్యాప్ రావడం పక్కా.

తెలుగులో చాలామంది హీరోల సరసన నటించింది శ్రీలీల. మహేష్, బాలకృష్ణ, రవితేజ, రామ్, నితిన్.. ఇలా లిస్ట్ పెద్దదే ఉంది. కాకపోతే ఆమెకు హిట్స్ కంటే ఫ్లాపులే ఎక్కువగా పడ్డాయి. ప్రస్తుతానికి ఆమె చేతిలో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా మాత్రమే ఉంది. ఆ సినిమా హిట్టయితే, ఆటోమేటిగ్గా ఆమె మళ్లీ టాలీవుడ్ లోకి వస్తుంది.

# ప్రశాంత్ వర్మ- కీరవాణి.. రానా

సినిమా పెద్దదైతే, బడ్జెట్ పెరిగితే, స్టార్ కాస్ట్ నే కాదు టెక్నీషియన్లు కూడా మారిపోతారు. హనుమాన్ అనే సినిమాను వీలయినంత బడ్జెట్ లో తీసారు. తేజ సజ్జా హీరో, హరి గౌర అనే చిన్న సంగీత దర్శకుడు.. ఇలా. కానీ ఇప్పుడు జై హనుమాన్ అలా కాదు. వందల కోట్ల బడ్జెట్. రిషబ్ షెట్టి హీరో గా చేరారు. దాంతో స్పాన్ మారిపోయింది. సినిమాలో కీలకపాత్రకు రానా ను తీసుకున్నారు. దాంతో సినిమా రేంజ్ మారిపోయింది. పాన్ ఇండియా సినిమా. భారీ స్టార్ కాస్ట్. అందుకే సినిమాకు పెద్ద మ్యూజిక్ డైరక్టర్ అవసరం పడింది. ఎం. ఎం. కీరవాణిని తీసుకున్నారు. ఇటీవలే కొన్ని మ్యూజిక్ సిట్టింగ్స్ పూర్తి చేసారు.





మైత్రీ సంస్థ నిర్మించే భారీ సినిమాల్లో ఇదీ ఒకటి. త్వరలో కర్ణాటక లోని హంపీ లో ప్రారంభమై నిర్మాణం జరుపుకుంటుంది. రిషభ్ శెట్టి ఈ సినిమా కోసం 80 కోట్ల పారితోషికం అందుకుంటున్నారన్న వార్తలు వున్నాయి. కాంతారా సినిమాతో ఆయన పేరు ఇప్పుడు అటు బాలీవుడ్ లో కూడా మారుమోగింది. అందువల్ల ఆ మాత్రం రెమ్యూనిరేషన్ సరైనదే అనుకోవాలి.

# ఇది కధకాదు.... ఒక మనిషి జీవితం..



నవతరం-శ్రీకాకుళం అర్బన్

- కాలేయ మార్పిడికి సహకారమందించండి
- నిస్సహాయ స్థితిలో ఒక పేదకుటుంబం
- సహాయం కోసం ఎదురుచూపులు

ఇది కధకాదు .... ఒక మనిషి జీవితం .. అంటూ ఒక నిరుపేద నిస్సహాయ కుటుంబం ఆవేదన అందరినీ ఆలోచింపజేస్తుంది. నియోజకవర్గ మండలం అంపోలు గ్రామానికి చెందిన ఉట్ల. హేమంత్ కుమార్ కుటుంబ కన్నీటి గాథ. చేతికి అందొచ్చిన కుమారుని పరిస్థితిని చూసి, ఆ తల్లితండ్రులు, అర్ధాంగి, పిల్లలు పడుతున్న కష్టాలను తెలుకోవాల్సిందే. అంపోలు గ్రామానికి చెందిన ఉట్ల. హేమంత్ కుమార్ గత కొన్ని సంవత్సరాలుగా లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతూ, మనసున్న దాతలు సహాయంతో ఇంతవరకు జీవితాన్ని నెట్టుకువచ్చారు. ఇప్పుడు పరిస్థితి తారుమారు .. ఆ కుటుంబం నిలబడాలంటే హేమంత్ కు తప్పనిసరిగా లివర్ మార్పిడి చెయ్యాలి. ఎన్నో కస్టాలు పడి, చిన్న ఉద్యోగంతో ఇంతవరకు కొనసాగిన కుటుంబం ఇప్పుడు చిందరవందర కాబోతుంది. నిరుపేద కుటుంబం అందులోనూ నిస్సహాయ వృద్దాప్య తల్లితండ్రులు, భార్య .. ఏం చెయ్యాలో తెలియని మనోవేదన.. ఇవన్నీ కలిపి ఒకటైతే, ఎన్ని రోజులుంటామో అర్ధం కానీ పరిస్థితి. తప్పనిసరిగా జీవించాలంటే, లివర్ మార్పిడి తప్పదు. ఈ విషయమై సహాయం కోసం దాతల సహకారం, వెన్నుదన్ను కోరుకుంటుంది ఆ కుటుంబం. నగరానికి చెందిన కొంతమంది ప్రముఖులు ఇప్పటివరకు సహకరించినా, ఇప్పుడు అంతకు పదిరెట్లు సహాయం అవసరం.

ఇది వరకు ఎంతో మందికి ప్రత్యక్షముగా, పరోక్షముగా సహాయం చేయటంలో సహకరించిన నగరానికి చెందిన రెడ్ క్రాస్ ప్రతినిధి నంది. ఉమా శంకర్, సామాజిక సేవకులు ఉర్లం. శివతేజ పట్నాయక్ ల సహాయం కోరారు. ఆర్ధికంగా వెనుకబడిన వారు కావటంతో పత్రిక ప్రతినిధుల సహాయం ఎంతైనా కావాలన్నది ఆ కుటుంబం ఆలోచన. ఇప్పటి వరకు అన్ని విధాలా సహకరించిన పత్రిక ప్రతినిధులకు చేతులెత్తి, పాదాభి వందనం చేసిన ఆ కుటుంబానికి చేయూత చాలా అవసరం. లివర్ మార్పిడికి సుమారు ముప్పై లక్షలు అవసరమని వైద్యులు తెలిపారని, అందుకోసం స్థానిక జేమ్స్ వైద్యశాలలో జీవన్దాన్ లో వివరాలను నమోదుచేశామన్నారు. దాతలు ఆర్ధికసహాయాన్ని అందించాలని, పూర్తి వివరాలకు మా చరవాణిని సంప్రదించాలని ఆ కుటుంబం కోరింది. లేదా ఫోన్ పే (9804020039) ద్వారా సహాయం అందించాలన్నారు.

Name : U. HEMANTA KUMAR.
A/C NO-31070101846
IFSC CODE -SBIN0000919.
MY PHONE PAY No-9804020039.

# పాఠశాల కి మైక్ సెట్ వితరణ

నవతరం-శ్రీకాకుళం

ఈరోజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నడుమూరు కు తమ తండ్రి హరికృష్ణ జ్ఞాపకార్ధం వారి కుమారులు రాజు మరియు సిసింద్రీ ఇరువురు కలిపి పది వేల రూపాయల విలువైన వైర్లెస్ బ్లూటూత్ మైక్ సిస్టంను కానుకగా అందించారు. పూర్వ విద్యార్థిగా ఇదే పాఠశాలలో చదువుకుని పాఠశాలపై అభిమానాన్ని చాటుకున్న సిసింద్రీని పలువురు ఉపాధ్యాయులు ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మార్పు చక్రధర రావు, ఉపాధ్యాయ సిబ్బంది బాబురావు, గోపాలరావు, అప్పలనాయుడు, ఈశ్వర రావు పాల్గొన్నారు.



# కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో ప్రజల భూములను కొల్లగొట్టి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే అభివృద్ధా?

నవతరం-మందస




కార్గో ఎయిర్పోర్ట్ పేరుతో ప్రజల భూములను కొల్లగొట్టి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడమే అభివృద్ధా? అని కేంద్రం పౌర విమానయ శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి గోవిందరావు,న్యూ డెమోక్రసీ జిల్లా ఉపాధ్యక్షులు వంకల మాధవరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి చాపర వెంకటరమణ,లిబరేషన్ జిల్లా నాయకులు మద్దిల రామారావు, కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్ష కార్యదర్శులు కొమర వాసు, జోగి అప్పారావు లు ప్రశ్నించారు. మందస మండలం గంగువాడిలో కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ విస్తృత స్థాయి సమావేశం సమావేశం కొమర వాసు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి అంటే భూములు కొల్లగొట్టడం కాదని మంత్రి గారికి హితవు పలికారు. మూడుసార్లు ఎంపీగా, ఒకసారి కేంద్రమంత్రిగా జిల్లాకు మీరు చేసిన అభివృద్ధి ఏమిటని వారు ప్రశ్నించారు. ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు అభివృద్ధి అంటే జిల్లా ప్రజల జీవితాల్లో మౌలికమైన మార్పు తీసుకురావడమని,జిల్లా ప్రజల్లో మౌలికమైన మార్పు తీసుకురావాలంటే జిల్లాలో ఉండే పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి ఇచ్ఛాపురం వరకు సాగునీరు, తాగునీరు ఇస్తే జిల్లాలో రెండు పంటలు పండి సంవత్సరానికి సుమారు 14 లక్షల కోట్ల ఆదాయము ప్రజలకు వస్తుందని,తద్వారా ప్రజల కొనుగోలు శక్తి పెరిగి అనేక వ్యవసాయ ఆధార పరిశ్రమలు వస్తాయని తద్వారా ఉపాధి దొరుకుతుందని అన్నారు. ఉద్దానానికి జీవనధారమైన జీడి పంటకు గిట్టుబాటు ధర ఇవ్వనోళ్లు, కిడ్నీ వ్యాధితో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నా పళ్లెత్తి మాట్లాడని వారు అభివృద్ధి చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఏద్దేవా చేశారు. నిత్యం అభివృద్ధి జపం చేస్తున్న కేంద్ర మంత్రి, పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడానికి బడ్జెట్ లో ఎందుకు నిధులు కేటాయించలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి గారు అభివృద్ధి ఉపాధి కోసం మాట్లాడటం హాస్యప్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి గారు వెంటనే కార్గో ఎయిర్పోర్ట్ ప్రతిపాదనను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా ప్రతిఘటన తప్పదని అన్నారు. మా ఊరు,మా భూమి, మా ఊపిరి పరిరక్షణకై ఫిబ్రవరి 28 వ తేదీన వొంకులూరు లో సభ,చేపడుతున్నట్లు సమావేశం తీర్మానం చేసింది.
అదే విధంగా ఫిబ్రవరి 24 నుండి 28 వరకు చైతన్య యాత్రలు చేపట్టాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ సమావేశంలో కార్గో ఎయిర్పోర్ట్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు వివిధ ప్రజా సంఘాల నాయకులు బత్తిని లక్ష్మణరావు, యన్ గణపతి,యన్ పరుశు రాం, కె వాసుదేవరావు, టి గున్నయ్య, జి లోకనాదం, పి ధర్మారావు, (సర్పంచ్ )ఆర్ శంకరరావు, సి హెచ్ గున్నయ్య, పి యర్రయ్య, జి వల్లభరావు, లండ రామస్వామి. తదితరులు పాల్గొన్నారు.

# ఏపీడబ్ల్యూజేఎస్ శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మెట్ట ధనుంజయరావు

- ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సమైక్య జిల్లా కార్యవర్గం అధికారిక ప్రకటన
- జిల్లా అధ్యక్షుడు వరాహ నరసింహులు సమక్షంలో ఏకగ్రీవ ఎన్నిక
- ఎన్నిక చేసిన నాయకులకు ధన్యవాదాలు తెలిపిన ధనుంజయరావు



నవతరం-శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ సమైక్య (ఏపీడబ్ల్యూజేఎస్) శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మెట్ట ధనుంజయరావును ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఏపీడబ్ల్యూజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు చల్లగుండ్ల రామకృష్ణ చౌదరి, మీడియా ఇంచార్జ్ నాగేండ్ల మల్లికార్జున, రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గురుగుబెల్లి అప్పలనాయుడు, రాష్ట్ర నాయకులు పైడి వేణుగోపాలం, పోకతోట సింహాచలం, విశాఖపట్నం జిల్లా అధ్యక్షుడు పి. యోగేశ్వర రావు ఆధ్వర్యంలో, జిల్లా అధ్యక్షుడు వరాహ నరసింహులు సమక్షంలో జిల్లా కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా తనను జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నందుకు సంబంధిత నాయకులకు మెట్ట ధనుంజయరావు ధన్యవాదాలు తెలిపారు.

# ఉపాధి హామీ పథకంపై డిసిసి అధ్యక్షులు పాదయాత్ర, సమావేశం

నవతరం -జి.సిగడాం

ఈరోజు జి.సిగడాం మండలం, మెట్టవలస గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలతో డిసిసి అధ్యక్షులు సనపల అన్నాజీ రావు గారు పాదయాత్ర చేసి వాళ్ళతో కలసి శ్రమచేసి వారి కష్టసుఖాలను తెలుసుకొని అనంతరం సమావేశం నిర్వహించారు, ఎచ్చెర్ల నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆబోతుల వెంకట నాయుడు, ఇజ్జురోతు రమణ, తాండ్రోతు గణపతి గార్ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో పాల్గొని కూలీలతో మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఏర్పాటు చేయడమైనది దీనివలన గ్రామీణ ప్రాంతాలలో ఉన్న ఉపాధి లేని కూలీల కోసం, నిరుద్యోగ యువత కోసం, కూలీల వలస నివారణ కోసం 100 రోజుల పని దినాన్ని కల్పిస్తూ సమగ్రమైన విధానాలతో రూపకల్పన చేయడం జరిగిందని దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో కొంత ఉపాధి కలిగే ఆర్థిక భరోసా ఈ పథకం వల్ల కుటుంబాలకు ఉండేదని తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల వీబీ రామ్ కీ అనే కొత్త ఉపాధి చట్టం పథకాన్ని తీసుకురావడం జరిగిందని దీనివలన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న కూలీలకు నష్టం వాటిల్లుతుందని, గ్రామీణ అభివృద్ధి కుంటుపడుతుందని 100 రోజుల పని దినాలు కల్పిస్తేనే ప్రభుత్వం సరిగా అమలుపరచలేని స్థితిలో ఉంటే కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ప్రస్తుతం 125 రోజులు పని దినాలు కల్పిస్తామని చెబుతున్నారని, ఉన్న 100 పని దినాలకే సరిగా డబ్బులు చెల్లించడం లేదని అలాంటిది 125 రోజులు ఎలా ఇస్తారని అంతేకాకుండా బడా గుప్త దారులకు అప్పు చెప్పి కూలీలకు అన్యాయం చేస్తూ వారికి ఇష్టం వచ్చిన వారు గుప్తాదారులు పనిని కల్పిస్తూ వారి ఇష్టారాజ్యంగా ఉంటుందని పనికి వేతనం ఎప్పుడు ఇస్తారో తెలియదని దీనివల్ల తీవ్ర నష్టం జరుగుతుందని, పంచాయతీల అభివృద్ధి వాటికి నిధులు మంజూరు చేయడంలో అధికారపక్షం వివక్షత చూపిస్తారని వారికి నచ్చిన పంచాయతీల అభివృద్ధి చేసుకుంటారని దీన్ని మీరందరూ వ్యతిరేకించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ కుమారుడు పిన్నింటి పారం నాయుడు డిసిసి అధ్యక్షులు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమం కరిమజ్జి మల్లేశ్వరరావు, శ్రీకాకుళం సిటీ కాంగ్రెస్ ప్రెసిడెంట్ రెల్ల సురేష్, జి. రామారావు నేతల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.



Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**